# పథాంతరం

★

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

సాయంకాలం పని మనిషి వెళ్ళిపోయిన దగ్గర నుండి ఒంటరిగా డాబా మీద కూర్చొని ఉంది సుమిత్ర. అరటి పళ్ళున్నాయి, అవి తిని, ఒక గ్లాసుడు పాలుతాగి పడుకొంటే హాయిగా ఉంటుందనుకొని వంట ప్రయత్నం ఏమీ తల పెట్టలేదు. సామాన్యంగా శరత్కాలపు వెన్నెలలోని స్వచ్ఛత్వాన్ని సౌందర్యాన్ని మాత్రమే వర్ణిస్తారు గాని, ఈ చిత్ర విచిత్రములయిన వర్ణాలతో శోభాయమానంగా వెలిగే ఈ పలచని మెత్తని మేఘాలను గురించి ఎక్కువగా వర్ణించరేమా అనుకొంది—ఏమో వర్ణించే ఉన్నారేమో తాను అంత పరిశోధనగా పుస్తకాలు చదివితేకదూ!

ఇంతకీ మనుష్యులకి సహజంగా ఏవి ఎలా ఉంటే అలా ఆనందించే శక్తి తగ్గిపోయింది. ఇంతగా రంగులలో ఆకారాలలో రామణీయకత వెల్లివిరిసే ఈ మబ్బు దొంతరల్ని చూడ్డానికి ఎవ్వరికీ ఓపిక ఉండదు గాని, వాటి గురించి నేను ప్రాకృతిక కవి పుంగవుణ్ణి అని ముద్ర వేసికొన్న ఏ విదేశీయ కవి రచించినవో పద్యాలను మిట్ట మధ్యాహ్నం ఎండ మండి పోతూ ఉండగా, యాభైమంది ఉత్సాహ భరితులూ చంచల స్వభావులూ అయిన పిల్లలను స్తబ్ధంగా కూర్చోబెట్టి బోధించి, వాళ్ళ చేత రాత్రి నిద్రాభరంతో కళ్ళు మూతలుపడుతూ ఉండగా గుడ్డిగా కంఠస్థం చేయించే వ్యవహారం అయిపోయింది ప్రకృతి దృశ్య పరిశీలన జనకమయిన సహజానందం.

సమీపస్థులైన ఒక మనిషి కోపతాపాలకూ, ఆగ్రహానుగ్రహాలకూ ఎంతో ప్రాముఖ్యము అంటగడుతూ ఉంటాము. తీరా చేసి ఆ మనిషీ, మనమూ, మొత్తం అందరమూ ఈ సువిశాల సుందర సుగభీర సృష్టిలో ఏ లేశమూ కామన్న మాట మరిచిపోతూ ఉంటాము. ఎంతసేపూ నేలకు పాతుకుపోయిన దృష్టి వల్ల వచ్చే అనర్థం ఇదే. కాస్త తల పైకెత్తి నిదానంగా చూడ గలిగితే! ఈ మబ్బులు, ఈ నెల వంక, ఈ చుక్కలు ఇవన్నీ ఉన్న సృష్టిలో మన క్షుద్ర జీవితాల గురించి ఎంతో విశేషంగా ఆలోచించడం ఎంత తెలివి తక్కువో అర్థం కాకపోదు. ఎవ్వరేమయినా సరే తనకేమీ ప్రసక్తి లేదన్నట్టుగా ఈ భూమి తన పర్యటనం తాను చేసుకొంటూ ఉంటుంది. ఈ భూమి, తనకు పూర్తిగా వార్ధక్యం వచ్చేవరకూ ఇలా సంచరిస్తూ మానవజాతికి నెలవై ఉంటుంది. తరవాత, జీవమే ఉండదు—... బాగానే ఉంది; గాని, మానవులకి కావలసింది అనంతమయిన కాలం కాక, తమ జీవిత పరిమాణానికి సంబంధించిన కొద్దిపాటి కాలం మాత్రమేకదూ! ఈ స్వల్పకాలంలోనూ, కలిసి ఉండక తప్పని మనుష్యులు తమ నడుమ ఏవో పూడ్చబడని అఖాతాలను తవ్వుకోకుండా ఉండలేరు కాబోలు. లోటు ఎవరిదైతేనేమి తనకూ సుబ్బారావుకూ నడుమ ఏర్పడిన అఖాతము పూడ్చబడనిదే.

మబ్బుల మెత్తని రంగులను తిలకించడంలో తన్మయురాలైన తనకు ఇంతలో ఇంతటి గాభరా కలిగించే సామాన్య దైనిక జీవితానికి సంబంధించిన ఆలోచన రావడం ఎంతో విసుగుదల కలిగించింది సుమిత్రకు. తాను సామాన్యదైనిక జీవితానికి సంబంధించిన విషయాలను గూర్చి ఆలోచించడానికి భయపడుతుందని కాదు, వాటి విషయమై అట్టే ఆలోచించ వలసింది లేదన్న నిశ్చయానికి తానిదివరకే వచ్చేసింది. తను ప్రస్తుతం అనుగమిస్తున్న పథాన్ని విడిచిపెట్టడం అన్నది నిశ్చయమే. కొత్తదారి ఎక్కడకు తీసుకొని వెళ్తుంది అన్నది ఇప్పుడు ఎంతగా బుఱ్ఱ చించుకొన్నా తేలేది కాదు.

కాక, ఈ భూమిని చీమల పుట్టల్లా అంటిపెట్టుకొని ఉన్న భూభాగాలను, తన్నివాసులయిన

మానవ మాత్రులను గురించి, కొద్ది క్షణాలయినా ఆలోచించకుండా ఉండలేదా? ఇన్ని మహా నక్షత్రాలు, వాటిచుట్టూ పరిభ్రమించే గ్రహపుంజాలు, వాటిలో సరిగా మన ధరాతలంవంటి వెన్నెన్నో, వాటిలో సరిగా ఈ ముహూర్తమందే ఎన్నికోట్ల మంది తమ పరిస్థితుల కనుగుణంగా పరిసర వాతావరణంతో ఏకీ భవించలేని తనవంటి అసంతృప్త జీవులున్నారో? లేరో? ఉన్నా, వ్యక్తిగతమయిన చికాకులనుమాత్రం ఎవరికి వారు పరిష్కారం చేసుకోవలసినదే. సరిగా మనలాగే ఇబ్బందులలో ఉన్నవారు, మనకంటె అధమస్థితిలో ఉన్నవారు చాలామంది ఉన్నారన్న నిబ్బరంవల్ల చేకూరే దేమీ లేదు; కొంత మత్తుమందువంటి చేతకాని తనపు తృప్తి మాత్రమే. అందువలన, తను వ్యక్తిగతములయిన అవకతవకలను మరిచిపోయి, మేఘమండలానికీ నక్షత్ర మండలానికీ ఎగిరిపోయేట్టుగా చూస్తూ కూర్చోవడం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. ఎంతసేపు మీదికి చూసినా తాను ఉన్నకంటె ఒక్క అంగుళం మీదికి వెళ్లలేదు. ఎప్పటి డాబామీదనే, ఎప్పటి కుర్చీలోనే ఉంటుంది. అసలు ఎగరగలిగిన పక్షులకు సైతం నిరంతరం ఎగరడమన్నది అసంభవం. వాటికి, ముఖ్యంగా వాటికే, గూడుండాలి; గుడ్లను పొదిగి పిల్లలను పెంచి పెద్దవిచేసే బాధ్యత ఏవిధంగా చూసినా తప్పదు— అవీ పాపం రెక్కలున్నాయన్న మాటేగాని, ఎక్కడికో తెలియకుండా ఎగిరి తప్పించుకొని పారిపోలేవు. భగవత్సృష్టి అయిన పక్షులగతే ఇల్లా ఉంటే మానవ నిర్మితాలయిన విమానాల సంగతి చెప్పేదేముంది! అవి గాలిలోనికి ఎరగడానికి దిగడానికీకూడా విశాలమైన స్థలమూ, అనేకమయిన ఏర్పాట్లూ కావాలి; ఎంతెంతో సిబ్బంది ఉండాలి. అంతే, ఎగిరిపోడం అన్నది అక్షరాలా సాధ్యమయినా, ఎక్కడికో ఎవరికీ అందకుండా తప్పించుకు పోవడం మాత్రం అసాధ్యమే. ఉన్న చిక్కులని చిక్కులుగా అంగీకరించి, సక్రమమయిన పద్ధతిని విడదీసుకోవాలి. అంతే కాని, కొద్దిసేపు ఏమీ సంబంధం లేనట్లుగా-ఇంత విశాలమైన సృష్టిలో ఈ భూమే అతి క్షుద్రమయినది; అందులోని పాంశురేణువుల వంటి నీవెంత నేనెంత - అని గమ్మత్తుగా అనుగోని లాభంలేదు. సృష్టి మొత్తం మీద భూమి చాలా చిన్నదయినా, నేను, చాలా పెద్దగా కనిపిస్తున్నంత కాలం, నా మిత్రులూ శత్రువులూ ఇతరులూ కూడా నా అంత పెద్దవారుగా కనబడడమే సహజం.

సరిగా ఆరింటికి వస్తానన్నాడు సుందరం. ఇప్పటికి ఏజాడాలేదు, ఏడుకావస్తోంది. అయితే మాత్రం ఇదంటే తనకేదో మహా జీవన్మరణ సమస్య లాగుందిగాని, అతనికేమిటి, బంధమా బలవంతమా? అతని ఇష్టం, విలాసం. కాని అతను దగ్గర ఉండి మాట్లాడుతున్నప్పుడు మాత్రం ఇదంతా ఏదో అతనికి సంబంధించిన సమస్యలాగు తానేమో మహోదయార్ద్ర హృదయంతో త్యాగం చెయ్యడానికి సిద్ధపడుతున్నట్టు అనిపిస్తుంది. కాని, తనకేం ఆ మాత్రం ప్రపంచజ్ఞానం లేకపోలేదు, అతను మంచివాడు గనుక తనమీద బాధ్యత అంతా వేసుకొంటున్నాడు గాని నిజానికి ప్రస్తుతపు అవసరము తనదే, అందుకు ఫలితమయిన అపవాద పడవలసిన సర్వబాధ్యతా తనదే. సుందరం కేవలం పరోపకార బుద్ధితో తనకు న్యాయంగా రావలసిన అపప్రథలో కొంత భాగం పంచుకొంటున్నాడు. అతని వంటివాడు కాపుగా ఉంటే ఎంతో ధైర్యంగా ఉంటుంది. అతని ప్రోత్సాహమే లేకపోతే తానింకా ఎంతో కాలం ఈపుంతనే పట్టుకొని జీవితయానం సాగిస్తూ ఉండి ఉండును, ఇప్పుడీ పథాంతరం గురించి మథనపడవలసిన ప్రసక్తి లేకపోవును.

అదుగో ఏడు గంటలు కొడుతున్నారు. ఇంకా రాలేదు. అసలు రానేరాడేమో? రాకపోయినా తన ప్రయాణం జరిగి తీరవలసిందేనా, కాదా? సుందరం రాకపోయినంతలో ఆగిపోయేంత దుర్బలంగా ఉందా తన జీవిత పథాంతర గవేషణా ప్రయత్నం? ఏమో అంతా గజిబిజిగా ఉంది.

అసలు ఇప్పుడీ బుద్ధి తనలో పూర్తిగా సుందరం ప్రోద్బలంవల్ల కలిగినదా? లేక తన భర్త సుబ్బారావు వెనుకటి అభిప్రాయాలకీ ఇప్పటి అభిప్రాయాలకీ, అసలు ఉన్న అభిప్రాయాలకీ ఆచరణకీ ఉన్న వ్యత్యాసం మూలంగా కలిగినదా? ఏమైనా ఒక విషయం మాత్రం సత్యం. తాను ఇక్కడ నుండి తప్పించుకొని వెళ్ళిపోయినంతలో, నూత్న మార్గం అంతా పువ్వులబాటగా ఉంటుందని హామీ ఏమీ లేదు. తాను అటువంటి భ్రమకు మీదుగానే ఉంది. సంపూర్ణంగా పరిసరాలకూ పరిస్థితులకూ అనుగుణంగా

ప్రవర్తించడం అన్నది తన స్వభావం లోనే లేదు. చిన్నప్పటినుండి తనది ఎదురు తిరిగే తత్త్వమే అయిపోయింది. ఇందు మూలంగా తాను సుఖపడక పోడం మాట అటుండగా తనకు అత్యంతమూ సన్నిహితులుగా ఉండేవాళ్ళకు కూడా అనవసరంగా ఆందోళన. అయితే మాత్రం తన మనస్సు నిశ్చయంగా ఒక పద్ధతిని సూచిస్తూ ఉంటే, దానిని కాదని అణచిపట్టుకొని తిండికీ బట్టకూ లోటు లేకుండా గడిచిపోతే చాలునన్న సర్దుబాటు తత్వం, ఇంత వయసు వచ్చినా పట్టుబడకుండా ఉంది; ఏం చెయ్యడం?

అంతా నిశ్చయానికివచ్చి, మళ్ళీ మళ్ళీ ఆలోచన పెట్టుకొన్నందువల్ల వచ్చేఅనర్థమేయిది. అయినా ఏ పనీ లేకుండా ఇలా స్తబ్ధంగా కూర్చుంటే పొల్లు ఆలోచనలు వచ్చాయంటే వాటిదా తప్పు? వెళ్ళి ఏవో పనిపాట్లు చూసుకోవాలి.

తనకు తెలియకుండానే కుర్చీలో నుండి లేచి మెట్ల దగ్గరకు వచ్చేక వెనక ఎప్పుడో విన్న సామెత జ్ఞాపకం వచ్చి తనలో తనకే నవ్వు వచ్చింది. మనువు విడిచిపోతూ పోతూ 'అత్తా నీ కొడుకు ఆకలి కూటివాడం'దిట ఒక కోడలు. తానీరాత్రితో ఈ యింటినీ, ఈ సంసారాన్నీ విడిచిపోతూంటే, మరింకా చేయవలసినపనులే ముంటాయి గనక? ఉన్నా, చేస్తే ఏమి లాభం, చెయ్యకపోతే ఏమి నష్టం?

రేపు సాయంకాలం ఈవేళకు తానెక్కడుంటుందో? ఇప్పటికే కాదు. ఇంకా కొన్ని గంటల పర్యంతము తనదయిన ఈ యింటికీ తనకూ ఏసంబంధమూ లేకుండా తెగిపోతుం దన్న మాట. తరవాత, ఏమవుతుంది? ఏంచేస్తుంది?... ఏమిటో తన ఒక్కతికే ఇంతగా దారీ తెన్ను తోచకుండా చీకటిగా ఉందో భవిష్యత్తు లేక అందరి సంగతీ ఇంతేనా?... తన కిప్పుడు నిర్భయంగా ఉండడానికి ఇల్లుంది; తిండికీ బట్టకూ కూడా ఏవిధమయిన ఆతృత పడనక్కరలేదు; తన భర్త గౌరవనీయుడయిన గవర్నమెంటు ఉద్యోగి. అదీ ఏ గుమాస్తా గిరీయో కాదు, ప్రబలాధికార సమన్వితుడయిన ప్రాథమిక పాఠశాలల పరీక్షాధికారి. జీతం అన్నది కేవలం నామమాత్రమే గాన, ఇతరత్రా రెండుచేతులా ఆర్జించుకొంటున్న ప్రయోజకుడు. ఒకప్పుడు కాలేజీవిద్యార్థినిగా ఉన్న రోజుల్లో తానూ చాలా ముచ్చట పడింది ఇటువంటి ఉద్యోగం గురించే. అయితే మరి ఈనాడు తనకు తన భర్త అంటేనూ సంసారం అంటేనూ ఇంతగా వైముఖ్యం కలగడానికి కారణం ఏమిటి? కొన్ని గంటలలో తానీ సంసారాన్ని విడిచి పోవడానికి నిశ్చయం చేసుకొని, ఆ సందర్భంలో ఇంకొకరికి మాట ఇచ్చి ఇప్పుడింకా తన అసంతృప్తికి కారణాలు వెతుక్కొంటోంది. రేపు ఎక్కడికో వెళ్ళిపోయిన తరవాత కూడా ఇటువంటి సందేహాలే కలుగుతాయి కాబోలు. తనమట్టుకు తనకే ఇంత అనుమానంగా అనిశ్చితంగా ఉంది తన ప్రయాణ కార్యక్రమమూ, అందుకు మూలకారణమయిన అసంతృప్తి విషయమున్నూ. కాని, తనను విమర్శించే లోకులకు మాత్రం ఎటువంటి అనుమానాలూ ఉండవు, సర్వమూ కరతలామలకమే. అతి స్పష్టంగా తనప్రయాణానికి, కాదు, లేచిపోవడానికి కారణాలు చెప్పకోగలరు. తాను మాత్రం లోగడ ఎందరిగురించో, అంతా తను ఒక్కతెకే తెలిసినట్లుగా కాలేజీలో చదువుకొన్న మనస్తత్వ శాస్త్ర పరిభాష ప్రకారం విభజించి, లేశమయినా అనుమానం లేకుండా మాట్లాడేది కాదా? ఇప్పుడు తనను గూర్చి అంతే జరుగుతుంది. దాన్లో విశేషమేమీ లేదు. అయితే లోకాపవాదానికి భయపడి తన మనస్సు చేసుకొన్న నిర్ణయాన్ని పాటించలేనంతటి భయస్థురాలు మాత్రం తాను కాదు...మరి తా నిప్పుడేమీ ఆలోచించలేదు. సుందరంవస్తే బాగుండును.

అదుగో, అనుకొంటూ ఉండగానే వచ్చేడు. మాట బైటికి అనకపోయినా, మనస్సు లోపల్లోపల నూరేళ్ళాయుస్సు అనుకొంది. అతను తలుపు పిలవకమునుపే, 'వస్తున్నానుండు సుందరం'అంటూ తొందరగా మెట్లుదిగి వెళ్ళి తలుపు తీసింది. సాయంకాలం ఆరుగంటలకల్లా వస్తానని ఇంత పర్యంతం రాకపోయినందుకు ఏదో సమాధానం చెప్తాడనుకొంది; కాని, కళ్ళతోకూడా మాట్లాడకుండా ఊరుకొన్నాడు. తనవెంటనే మెట్లెక్కి వచ్చేడు నిశ్శబ్దంగా. ఆమె తిన్నగా వెళ్ళి తన కుర్చీలో కూర్చొంది. సుందరం ఆమె అనుకొన్నట్టుగానే వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

ఒక నిమిషంపాటు మాట్లాడకుండా కూర్చొని లేచివెళ్ళి లైటు స్విచ్చివేసి మళ్ళీ వచ్చి కూర్చు

న్నాడు. కొంతసేపటికి ఆమె "ఏమిటి సుందరం! అంత పరీక్షగా చూస్తున్నావు నా మొగం? అందులో ఏమైనా కొత్త కొత్త మేఘాలూ మెరుపులూ కనబడడం లేదుకదా లైటు కూడా వేసేవు" అంది సస్మితంగా.

సుందరం వెంటనే ఏమీ సమాధానం చెప్పలేకపోయేడు, కాని, అతని దృష్టి మాత్రం ఆమె ముఖసీమనుండి క్రిందికి దిగింది.

"చూపుల్తో నే నన్ను చిత్రించేస్తున్నావేమిటి సుందరం, లేకపోతే ఏమిటీ ఆపాదమస్తక పరీక్ష." అంది సుమిత్ర. కాని, అందుకు కూడా సుందరం దగ్గర నుండి వెంటనే సమాధానం లేదు, చీర అంచుల క్రిందుగా కనిపించీకనిపించని ఆమె పాదాల మీద నే లగ్నమయి ఉంది.

"మూగనోము పట్టారా ఏమిటి మున్ముందు చేసుకోబోయే భార్య చిరాయురారోగ్యైశ్వర్యముల నిమిత్తం"

మరి సమాధానం చెప్పకుండా ఉండలేకపోయేడు సుందరం. "నాకు భార్యంటూ ఉండడమన్నది ఈ జన్మలో తటస్థించే వ్యవహారం కాదులే, లేకుంటే, తప్పకుండా నువ్వు చెప్పేనరకం సత్ఫలితాలు కలుగుతాయని నమ్మకం ఉంది. ఒక్క మూగనోము మాత్రమే కాదు, అంతకు పదింతలు క్లిష్టతరమయిన నోములూ వ్రతాలు పట్టడానికయినా అభ్యంతరం లేదు. అయితే ఈ మన పవిత్ర భారతదేశంలో నోములూ వ్రతాలు మొదలయిన వన్నీ స్త్రీలు తమ భర్తల అభ్యున్నతి నిమిత్తం ఆచరించేటటు వంటివే. ఏమయినా ఈ జన్మలో మరి అటువంటి విచారానికి సావకాశం లేదు. సరేగాని, నాకు ఎంత ఆలోచించినా ఒక నిశ్చయం అంటూ ఏర్పడలేదు, జన్మాంతరాలు ఉంటా యంటారా?"

"ఉంటాయంటే సంతోషమా? ఉండవంటే సంతోషమా?"

"మన సంతోష విచారాలను బట్టి నడుస్తుందా జగచ్చక్రము. అసలు నాబాధ ఏమిటి అంటే, ఈ జన్మలో ఎన్నెన్నో చెయ్యాలనుకొంటాము; చివరికి ఏమీ చెయ్యలేక పోతాము. ఇక, ఎన్నెన్నో చెయ్యకూడని పనులు చేసి వెనుక పశ్చాత్తాప పడతాము. మనం చేసిన సత్కర్మలకు అర్హమయిన ఫలితం లేదంటే, కొంత నిరాశగా ఉండదూ? ఫలాపేక్షతో కర్మలు చేయవద్దని చెప్తేమాత్రం, చేసిన ప్రతిపనికీ ఏదో ఒక ఫలితం అంటూ ఎట్టఎదురుగా కనిపిస్తున్నప్పుడు, ఈ జీవితం అంతా కలిపి గడిగిన చర్యకు ఫలితం అంటూ లేకుండా పోతుందా? ఉంటే అది జన్మాంతర రూపంలో ఆవ్యక్తే, అంటే నా ఉద్దేశం ఆ ఆత్మే అనుభవిస్తుందా? లేక ఏ ఒక్కడో చేసిన కర్మఫలం మూక ఉమ్మడిని సంఘం అంతా అనుభవించ వలసినదిగా తయారయి ఊరుకొంటుందా?"

"నీయీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పగలననే అనుకుంటున్నావా? ఒకవేళ చెప్పగలిగినా నీకు మరే అనుమానం లేకుండా సంతృప్తిగా ఉంటుందా?"

"చక్కగా అడిగేవు. నువ్వు సమాధానాలు ఎంత సక్రమంగా చెప్పగలిగే ననుకోన్నా నాకు మాత్రం తృప్తి అంటూ ఉండదు. ఉండేమాటైతే ఇదివరకు నేను చదివిన పుస్తకాలూ విన్న బోధనలూ ఇవే చాలును. అయితే ఒకవేళ తృప్తి కలిగినా అది తాత్కాలికమే. మళ్ళీ ఒంటరిగా కూర్చునేసరికల్లా ఎప్పటి సందేహాలే కలుగుతాయి."

"నీకేమిటి మహారాజువి. ఈ జన్మని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు గనక, జన్మాంతరాల గురించి హాయిగా ఆలోచించగలవు. మావంటి వాళ్ళకి ఈ జన్మలో ఇప్పటి కాలంలో చుట్టుముట్టి ఉన్న సమస్యలను గూర్చి ఆలోచించి పరిష్కరించుకోవడమే దుర్ఘటంగా ఉంది. అందుచేత నీ అతిలోక సమస్యలకి సమాధానాలు నువ్వే ఆలోచించుకోవలసినదే."

"నిజమే, నా సమస్యలకూ నీ అనుమానాలకూ ఒక అంతు అంటూ ఉండదులేగాని......"

"మధ్యలో నన్ను కూడా కలుపుతావెందుకు? నాలో అనుమానాలున్నాయని నీకేం తెలుసు?"

"ఇంకా తెలియడానికేముంది? నేను వచ్చేసరికి, నువ్వు ఉన్న ధోరణే చెప్తుంది. ఇంట్లో ఎక్కడా దీపం లేకుండా, నువ్వు ఏమీ సర్దుకోకుండా ఏ విధమయిన అలంకరణ లేకుండా ఇలా ఉండడమే సాక్ష్యం నీలోని అనుమానాలకు."

"సరే బాగానే ఉంది. నీలో జగత్తంతటికీ సంబంధించిన ధర్మ సందేహాలూ, నాలో ఏవో నా క్షుద్ర వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుమానాలున్నా. మరి ఇవి తీరేవి కావు లేగాని, ఇవాళ ఇంతసేపటివరకూ రాకపోడానికి గల కారణాన్ని నేను అడగలేదు నువ్వు చెప్పలేదు."

"చాలా చాలా క్షమాపణ చెప్పుకోవాలనే వచ్చేను; గాని, రాగానే నిన్ను చూసేసరికల్లా నేనను కొన్న మాటలన్నీ మరిచిపోయేను. మన ప్రయాణానికి కావలసిన వస్తువులు నాలుగూ కొనడంలో కొంత అవసరమైన ఆలస్యం అయింది. మొదట ఏమో ఒక అరగంటలో అయిపోదా అనుకొన్నాను. కాని, తీరా బజారుకి వెళ్ళిన తరువాత, ఒకటి తరవాత ఒకటి చొప్పున ఎన్నెన్నో అతి అవసరమయిన వస్తువులు కనిపించేయి. అయితే నాకు అవసరమని తోచినవే కొన్నాను. ఇంకా ఎన్నెన్ని మరిచి పోయేనో? కొన్నవయినా నీకు పనికివస్తాయో రావో, నిన్ను బజారుకి రమ్మంటే ఎలాగూ రావని తెలుసును. అందుచేత కేవలం నా ఊహ మాత్రమే వినియోగించికొన్నాను. నువ్వు మామూలుగా ఉత్సాహంగా ఉంటే వెంటనే మా యింటికి తీసుకొనివెళ్ళి, అన్నీ చూపించాలనుకొన్నాను. కాని, నీ సంగతి చూసే సరికల్లా...

"ఏమిటచెప్తా ఇవాళ నాలో అంత ప్రత్యేకంగా కనిపిస్తున్నది? నేనేం కొత్తమనిషిగా కనిపిస్తున్నానా? నామట్టుకు నాకేమీ వింత కనిపించడం లేదే."

"లేదంటే నేనేమీ అనలేను. అసలు మనం కోరుకోవలసినదీ అంతే, కాని, ఏదో పరధ్యానమూ అనాసక్తతా నీలో కనిపించక పోవడంలేదు"

"నువ్వు ఇవాళ మామూలుగా ఉన్నట్టు లేవు. లేకపోతే ఈ మూగనోమూ, ఈ నిదానమూ, ఈ లేని విశేషాలు గోచరించడమూ ఇదంతా ఏమిటి?"

"నిజమే, కొద్ది నిమిషాల్లో ఎన్నో వందల మైళ్ళ ప్రయాణం పెట్టుకొని, మనం ఆ ప్రసక్తే లేకుండా ఉండగలగడం చిత్రంగా లేదూ?"

"ప్రయాణం అంటూ ఉంటేమాటైతే చిత్రమే."

"అంటే ఏమిటి నీ మాట, ప్రయాణంగాని, వాయిదా వెయ్య లేదుకదా?"

"ఏం అంత గాఢంగా అడుగుతున్నావు?"

"వాయిదా పడకపోతే గాభరా లేదుగాని, వాయిదా పడితే గాభరా కాదూ మరి. ఈమధ్య నల్లా అందుగురించే తయారవుతున్నాము కదా, అందులో ఇవాళ రోజంతా ప్రయాణ ప్రయత్నంతోనే గడిచిపోయింది. నీసంగతి చూస్తే మధ్యాహ్నం నేను వెళ్ళిపోయిన దగ్గరనుండీ, ఇలాగే కూర్చున్నట్టున్నావు, కొంతసేపు క్రిందనూ, తరవాత ఇక్కడ డాబామీదనూ. సరే, ఏమైనా, నేను చెయ్యవలసిన ప్రయత్నాలన్నీ చేసేను. మనకి రైలు రెండుంపావుకి. నిద్రపోతే తరవాత అలారం పెట్టుకొని లేచినా, బద్ధకంగానే ఉంటుంది. అందుకని ఒక మంచిసుళువు ఆలోచించేను. నీకు ఇష్ట పడుతుందో పడదో?"

"అసలు నీ సుళువు ఏమిటో వినకుండానే ఇష్టపడిందనమన్నావా?"

"ఏమీ లేదు, ఇప్పుడు భోజనంచేసి సినీమాకి పోయేమంటే, తిరిగి వచ్చేసరికి ఒంటి గంట దాటుతుంది. వెంటనే తిన్నగా స్టేషనుకి వెళ్ళిపోయేమంటే సరిగా వేళకు వెళ్ళినట్టే అవుతుంది నీకిష్టమేనా?"

"ముందిప్పుడు సినీమాకి కదూ మనం వెళ్ళడం. అంటే ఇంకా చాలా వ్యవధి ఉందన్నమాటే."

"నీ ద్వంద్వార్థపు మాటలు వింటూంటే నాకు గాభరాగానే ఉంది. గాని పోనీ, సినీమావరకు ఒప్పుకొన్నావుకదా. మరి లేచి వేగం భోజనం కానీ."

"అంటే మరిప్పుడు సినీమాకి వెళ్ళక తప్పదన్నమాట?"

"అదుగో అదేనాకర్థంకాకుండా ఉంది. నీకిష్టం లేకపోతే మరి వెళ్ళినా వెళ్ళకపోయినా ఒకటే."

"అయితే నా కోసమే నువ్వు వెళ్తున్నావన్నమాట."

"మరి నువ్వు స్పష్టంగా మాట్లాడకపోతే నేనేమీ మాట్లాడలేను. నువ్వే చెప్పు, నన్నేం చెయ్యమంటావో?"

"చేస్తావా నేను చెప్పినట్టు?"

"ఎందుకు చెయ్యను? సబబుగా ఉంటే తప్పకుండా చేస్తాను."

"అదుగో హంస పాదు పెట్టేవు మళ్ళీ."

"ఇంతకీ నువ్వు చెప్పేదేమిటో తేమలకుండా నే వాదనలోకి దించేసేవు."

"ఏమీ లేదు, నువ్వు వెళ్లి హాయిగా భోంచేసి పడుకో్క"

"మరి నువ్వు?"

"నేనూ అంతే."

"అంతేనా? నాకయితే మా సుబ్బయ్యగారు వండిపడేస్తాడు. మరి నువ్వు ఏమీ వండుకొన్నట్టు లేదు. పోనీ ఈ రాత్రికి మా యింటికి భోజనానికి వచ్చేయకూడదూ?"

"నేనా??"

"ఏమి రాకూడదా అంత వింతగా అడిగేవు?"

"వింతేముంది. రేపుప్రొద్దుననుండీ మనమిద్దరం ఒకేదగ్గర ఉండబోతున్నప్పుడు."

"మరయితే ఎందుకీ అనుమానం. లే, పద, సినీమాకిమాత్రం అలస్యం ఎందుకూ? వేగం లేచి భోంచేస్తే మరి ఆట్టే వేళుండదు."

"సుందరం! ఇంత అమాయకుడవు, ఇన్నాళ్ళు పెళ్లికాకుండా ఎలా ఉండిపోయేవో నాకు ఆశ్చర్యంగా ఉంది."

"ఈ ప్రక్కదారి కొత్తవింతకు అంతరార్థం ఏమిటో నా క్షుద్రబుద్ధికి అందకుండా ఉంది."

"విద్యారూప సంపదలు పుష్కలంగా కలిగి, అన్నిటికీ మించిన స్వాతంత్ర్యం కలిగిఉన్నటువంటి నీవంటే ఎంతయినా పోటీ ఉండవలసింది పెళ్లికొడుకుల బజార్లో. నీవంటి వాడు దొరకడానికి పెళ్లికూతుళ్లూ, వాళ్ల తల్లిదండ్రులు నువ్వు చెప్పినట్టు వెనకటి జన్మల్లో ఎన్ని తపస్సులు చేసిఉండాలోకదా!"

"ముప్ఫైఏళ్ళు పైబడిన నేనుకూడా ఇంకా నీకంటికి కాబోయే పెళ్లికొడుకులాగే కనిపిస్తున్నానా?"

"బొమ్మల పత్రికలలోని ఈనాటి నవదంపతుల బొమ్మలతో పోల్చిచూసినప్పుడు నువ్వింకా ఈడు రానంత చిన్నవాడివిగానే కనిపిస్తావు"

"అంతేన్లే. ఇంకా ఇతరుల దృష్టికి చిన్నవాడిలాగ కనిపిస్తూఉండనా, అని సంతృప్తి పడేట్టుగానే ఉందిలే ప్రస్తుత పరిస్థితి."

"నీవంటివాడికే అలా ఉంటే తక్కిన మాబోటి జనసామాన్యంమాట చెప్పేదేముంది."

"తక్కినవాళ్ళ కెవళ్ళకీ అలా అనిపించదనీ, ఇది నా ఒక్కడికీ ప్రత్యేకంగా ఉన్న దుర్లక్షణం అనీ నా నమ్మకం."

"ఈ ప్రపంచం ఇలా తయారవడానికి మరేమిటి కారణం. సగంమందికి ఏమీ తెలియకపోయినా అతి గర్వం; తక్కిన వాళ్ళకి అతి వినయం అనే పేరుతో తమని తాము గుర్తించుకోలేకపోడమున్నూ"

"నీ దయవల్ల నేను చేరితే మొదటి సగంలో నే చేరుతాను గాని, రెండవ సగంలో చేరనని నా నమ్మకం."

"నీ వ్యవహారం అంతా దానినే సూచిస్తున్నదిలే, గాని, సుందరం ఒక్కమాట అడుగుతాను, కోపం తెచ్చుకోవు కదా!"

"నేను అంతకోపం తెచ్చుకుంటానని భయంగా ఉంటే అడక్క గాని, మరెందు కాలస్యం, నువ్వు వేగం తయారయివస్తే, భోజనం చేసి, సినీమాకి పోదాము."

"అలాగే గాని, నీకు నిజంగా ఇప్పుడు సినీమా చూడాలని ఉందా?"

"ప్రత్యేకించి, చూడాలని ఏమీ లేదు గాని, ఏదో కాలక్షేపం కావాలా మరి"

"అంటే, నీకిలా నాతో మాట్లాడుతూ ఉంటే, సక్రమంగా కాలక్షేపం జరిగినట్టులేక, ఏదో వృథా అయిపోతున్నట్టున్న దన్నమాట? అయితే, ఇక మరి......"

"అదా నా మాట కర్థం? నాకిలా కొన్ని గంటలు కాదు, ఎన్ని గంటలయినా సరే నువ్వు మాట్లాడుతూఉంటే మరేమీ అక్కర్లేదు. అయితే ఉండిఉండి హఠాత్తుగా లేచిపోతావేమోనని భయం"

"ఇప్పుడు మనం చేస్తున్న పని అదే కదూ?"

"ఏమిటి?"

"మరేమిటి, లేచిపోవడం."

"ఓస్, ఇదా నీ అనుమానం. ఇప్పుడు తెలిసింది నాకు నీ ద్వంద్వార్థపు మాటల అర్థం."

"ఏమిటి చెప్మా తెలిసింది?"

"నీ అనుమానానికి, వెనుకంజ వెయ్యడానికీ కారణం. నేనిదివరకు ఇన్నిరోజులుగా చెప్పినకంటె ఎక్కువ చెప్పగలనని కాదు గాని, మరొక్కమారు చెప్తున్నాను."

"నీకు సంబంధించిన కారణాలవల్ల నే నేమీ వెనకంజ వెయ్యడంలేదని నీకూ తెలుసును. మరింతకంటె నే నేమిటి చెప్పడం?"

"చెప్పవలసింది నువ్వు కాదు నేను; నీకు ఇక్కడి దాంపత్యజీవితం బహుకారణాలవల్ల నచ్చని మాట వాస్తవం. ఇక, ఏదో విధమయిన నూత్నపద్ధతి ఏర్పాటుచేసుకోనేందుకు నాకు వీలయిన సాహాయ్యం చేస్తానన్నాను యద్విధమయిన ప్రతిఫలాపేక్ష లేకుండాను."

"మరి ఇందాకా, ఈ జన్మలోని సత్కర్మ అంతటికీ అర్హమయిన సత్ఫలితం మళ్ళీ జన్మలో ఉంటుందన్న నిశ్చయం లేకపోతే ఆశాభంగంగా ఉంటుందన్నావు?"

"అదా, అది నా ఒక్కడిగురించే అన్నటువంటి మాట కాదు. లోకం మొత్తంమీద పునర్జన్మ అన్నటువంటిది ఉందా లేదా అని. అటువంటి సందేహం ఎవరికయినా ఏ కాలంలోనయినా కలగవలసినదే. దాని మాటకేమి, ఇప్పుడు మన ప్రయాణం విషయంలో ప్రత్యక్షమయిన ఫలాపేక్ష ఏమీ లేదంటున్నాను. అథవా ఒకవేళ ఉన్నా, అది నీలో, సుందరం ఒక విశ్వసనీయుడయిన మిత్రుడు, అన్న స్ఫురణను కలిగించుకోవాలన్నంతకంటె మరీ హీనమయినది కాదనుకొంటున్నాను. అందుకు ప్రతిఫలంగా లేశమాత్రం అపకీర్తిని తలని ధరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అయినా మరి నువ్వు ఎందుకు వెనకాడుతున్నావో నాకర్థం కాకుండా ఉంది."

"అందరికీ అన్ని సమస్యలూ అర్థమయి తీరాలన్న పూచీ లేదుకదా!"

"అయితే మొత్తానికి నువ్వనేది స్పష్టంగా చెప్పు. మన ప్రయాణం ఉందా లేదా?"

"నీకేమిటి, సర్వథా స్వతంత్రుడివి. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళగలవు. ఇక నా సంగతి ఆలోచించుకొందికి, వ్యవధానం చాలా ఉందికదూ?"

"అన్ని విషయాలూ అంత నిశ్చయంగా విస్పష్టంగా మాట్లాడేదానివి, ఈ విషయంలో ఇంత సందిగ్ధంగా ఎలా తయారయేవో నాకు తెలియకుండా ఉంది. నువ్వీ ముందు వెనుకల ఆలోచనలన్నీ నిజంగానే పెట్టుకొంటున్నావో, లేక కేవలం నన్ను పరీక్ష చేయడానికీ అంటున్నావో బోధపడకుండా ఉంది."

"నిజానికన్నా తమాషాకన్నా క్రియజరిగేది ఒక్కటే కదూ!"

"అంటే మరి ప్రయాణం ఉందో లేదో నువ్వు స్పష్టంగా చెప్పవన్నమాట?"

"నీయిష్టమే, నీకుండాలనుంటే ఉంది; లేకుంటే లేదు."

"అమ్మయ్య! అయితే నేను ఊరికినే గాభరా పడ్డానన్నమాట. సంశయ గ్రస్తదృష్టికి సర్వమూ శంకించవలసినది గానే రూపిస్తుంది కాబోలు. మరి, లేద్దామా?"

"దేనికి?"

"సినీమాకి. నువ్వేమీ ఈ సాయంకాలం వంట ప్రయత్నంచేసినట్టు లేదు. నీకు మాయింటికి రావడం మొగమాటం అయితే ఇక్కడికే పంపిస్తాను మా సుబ్బయ్యగారిచేత. నువ్వు భోంచేసి సిద్ధంగా ఉంటే, నేనిలా బండీ తీసుకొని వస్తాను. సరేనా?

"నాకేమీ తినాలని లేదు. కాబట్టే వండుకోలేదు. పాలూ అరటిపళ్ళూ ఉన్నాయి. అయినా సరే, నీయిష్టం."

"పోనీ నా తృప్తికోసమే అనుకో. అయితే అవి పంపించినంతలో నాకు తృప్తి కలగదు. నువ్వు వాటిని సక్రమంగా ఉపయోగిస్తేనే నిజమయిన తృప్తి. మరి నేను వెళ్తున్నాను. నువ్వు లేస్తావు కదూ."

"అలాగే"

"సరిగా నేను తొమ్మిదింపావుకి వస్తాను. నువ్వు సిద్ధంగా ఉండాలిసుమా."

సుందరం రానంతసేపూ ఎందుకు రాలేదో అనిపించినా, అతను వెళ్ళిపోవడంతో ఏదో పెద్ద బరువు తీరినట్టు అమ్మయ్య అనిపించింది సుమిత్రకు. అనుకోకుండానే డాబా అంచువరకు వెళ్ళి, పిట్టగోడ

మీదుగా వెనుతిరిగి వెళ్ళిపోతున్న సుందరం కనిపించినంతవరకూ చూసింది. తరవాత ఒకమారు పూర్తిగా డాబామీద చుట్టూ తిరిగి మళ్ళీ తన కుర్చీలో యథాస్థానంలో కూర్చుంది.

మళ్ళీ తన నక్షత్రాలూ తానే మిగిలాయి. సుందరం దగ్గరున్నంత సేపూ తానొక పెద్ద ముఖ్యమయిన వ్యక్తిగానే కనిపిస్తుంది. కాని, ఇలా ఒంటరిగా ఉండేసరికి మాత్రం తన అశక్తి, తన అల్పత్వం స్పష్టంగా గోచరిస్తాయి. తన కష్టసుఖాలు, ఇష్టానిష్టాలు వీటితో ఏమి ప్రసక్తి ఉంది ఈ విశాల జగచ్చక్ర పరిభ్రమణానికి. ఉఁ హుఁ. మరి ఈ రకంగా ప్రకృతితో పోల్చుకొని, తనకు, అప్రాధాన్యం ఆపాదించుకొన్నందువల్ల ఇదేమీ విడిపోయే సమస్య కాదు. తాను, మరి ఎటువంటి అనుమానాలు లేకుండా ఒక నిశ్చయానికి రావాలి.

ఇంతవరకూ ఏ అనుమానం లేకుండా ఉన్న మనిషి, తాను సుందరంతో మాట్లాడినప్పుడెందుకంత సందిగ్ధంగా అసలు ప్రయాణమే జరుగుతుందా లేదా అన్నట్టు మాట్లాడింది? అదంతా అతన్ని పరీక్షించడం కోసమా? ఎంత మాత్రమూ కాదు. అతను ఏదో మాట అనే సరికల్లా అప్రయత్నంగా తన నోటంట వచ్చిన మాటలే అవి. అంటే, నిజానికి వాటిలోనే తన ఆంతర్యంలోని అభిప్రాయం నిగూఢమై ఉండి ఉండాలి.

అంటే తనకిప్పుడీ ప్రయాణం ఇష్టంలేనే లేదా? అనగా తానీ సంసార యాత్రను సుబ్బారావు గృహిణిగా సక్రమంగా, శాశ్వతంగా సాగించగలదా? లేకపోతే ఇంతకంటె మేలైన తరుణం వేరే ఏదైనా ఉంటుందా? ఇప్పటికి తనను బిగించి ఉంచినది ఒక్క దాంపత్య బంధమే, ఇంకా ముమ్ముందు ఇంతకంటె బలమయిన బంధాలు కూడా ఏర్పడవచ్చును. అప్పుడు తన మార్గం మరింత దుర్గమంగా తయారవుతుంది.

చివరికి ఏమయితే అదే కానీ, అంతా భగవదిచ్ఛ అని, ఊరుకొన్నందువల్ల ఫలితం లేదు. ఎంత భగవదనుగ్రహం అయినా, కొంత మానవ ప్రయత్నం అంటూ ఉండకపోతే ఎలాగ?

ఇంతగా ప్రాపంచిక జ్ఞానం సంపాదించేననుకొని, మనస్తత్వ పరిశీలనలో కృషిచేసి చివరికి స్వవిషయం వచ్చేసరికల్లా, ఇల్లా ఏదో తప్పించుకుపోయే, ఇతరులమీద బాధ్యత నెట్టివేసే, మనిషి కావడంకంటె హాస్యాస్పదమయిన సంగతి ఏముంటుంది? కాబట్టి మరి ఎటువంటి అనుమానమూ, తొందరపాటూ, అందువల్ల తరువాత కలిగిన అనవసరమయిన ఆరాటమూ, ఇవేమీ లేకుండా మనస్థితి ఏమిటో తేల్చుకొని, భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించుకొని, అందుకు నూటికి నూరుపాళ్ళు బాధ్యత శిరసా వహించడానికి సిద్ధపడాలి

తానాలోచించవలసిన వాటిలో మొట్టమొదటి విషయం: తాను తన భర్త సుబ్బారావును విడిచి వెళ్ళిపోడం తప్పనిసరి అన్నందుకు చెప్పుకొంటున్న కారణాలేమిటి?

ప్రధానమయినది సుబ్బారావు అధికార గర్వం. తాను చేస్తున్నది ఒక అతి సామాన్యమయిన నౌఖరీ మాత్రమేననీ, తన క్రింది వాళ్ళని తాననుకొనే మాష్టర్లకంటె తానే విధంగానూ అధికుడు కాదని గుర్తించలేకపోవడం; తత్ఫలితంగా వాళ్ళను చాలా హీనంగా చూడడమూ, అదంతా ఏదో మహత్తరమయిన అధికార లాంఛనంగా భావించడమున్నూ.

తరవాత, డబ్బే సర్వప్రధానమనుకొని, ఏదో ఒక మాదిరిగా కాలక్షేపం జరిగేపాటి జీతం ఉంటున్నా, డబ్బు గురించి, ఎక్కడలేని కక్కుర్తి పడడం. ఆ కక్కుర్తి అయినా తన క్షుద్రత్వమూ లోపమూ అని అంగీకరించక, ఏదో మహత్కార్యం చేస్తున్నట్టు, ఎందరికో అయాచితంగా ఎన్నెన్నో ఉపకారాలు చేస్తున్నట్టు, తను ఆత్మవంచన చేసుకోడం మాత్రమే కాకుండా, స్వబంధు మిత్రులను కూడా నమ్మకోమనడమూ. ఏమో తాను వాళ్ళను సంతృప్తి పరచడం నిమిత్తం ఈ కొద్దిపాటి లంచాలు పుచ్చుకోక పోయినట్లయితే తన చేతిక్రింది మాష్టర్లింత సుఖంగా కాలక్షేపం చేయలేరనీ, తను చేసిన ఉపకార పరంపరకు వాళ్ళు ఆజన్మాంతం కృతజ్ఞులుగా ఉండాలనీను—

ఇక తన ఈ మహత్తరమయిన అజ్ఞానపాటవానికి తన చుట్టూ ఉన్న సంఘమంతా ఉబ్బి తబ్బిబ్బయి బ్రహ్మరథం పట్టలేదని ఆక్రోశపడడం.

తనకంటె ఉన్నతమయిన ఆశయాలు కలిగిన వారిని, అందులోను ముఖ్యంగా పూర్వ మిత్రులను

సరిగా అర్థం చేసుకోలేక పోడమే కాదు; వాళ్లేమో తనకంటె ఎంతో వెనకపడిన వారనీ, తనపాటి ప్రయోజకులు కారనీ, తాను వాళ్లను చిన్న చూపు చూడ్డమే సబబు అని పట్టరాని దురహంభావము కలిగి ఉండడం.

వాచ్యంగా తనతో ముఖాముఖీని అనడానికి ధైర్యం చేయలేకపోయినా, ప్రాసంగికధోరణిని మాత్రం, భార్యాభర్తృ సంబంధం విషయమై పవిత్రత అనే పేరుతో అతిసంకుచితమయిన అభిప్రాయాలు వెలార్చుతూ ఉండడమూ; భార్య, భర్త ఎటువంటి వాడయినా, ఏవిధంగా సంచరించినా, మారుమాట్లాడకుండా జీతంబత్తెం కోరని సేవికగా పడిఉండాలని ధ్వనించేలాగా మాట్లాడుతూ ఉండడం.

తను కొన్న ప్రతి చీరకు, ఇంటికి తెచ్చిన వస్తువుకూ, అయాచితంగా దానంచేసినట్లుగా విశేషించి పొగడ్తచెయ్యాలనుకోడం. అనగా ఏమిటి, ఇంట్లో తన తిండి బట్టలకు కూడా అర్హతలేనట్టు, ఏమో ఔదార్యశాలి గనుక తాను ధర్మార్థం పోషిస్తున్నట్టు అభిప్రాయపడడం.

ఇల్లాగే చిల్లరమల్లర విషయాలు, పనిమనుషుల విషయంలోనూ, ఇంటిఖర్చు వెచ్చాల విషయంలోనూ తనమాటే అంతిమనిర్ణయం అయినప్పటికీ తానేమో మహా పురోగమించిన అభిప్రాయాలు కలిగినవాడు కాబట్టి భార్య ఇష్టాన్ని పాటిస్తున్నట్టుండడం, స్పష్టంగా ఖర్చుపెట్టిన ప్రతికానీ పద్దురాసి తీరాలనడానికి సంకోచం అయినా, అలాగని ఊరుకోలేక, ఏదో పరధ్యానంగా మాటల సందర్భాన్ని అడిగినట్టుగా, తానదివరకు ఇచ్చిన డబ్బు ఖర్చును గూర్చి అడుగుతూ ఉండడం...

ఇక మంచి బొమ్మలు చూడడం, పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, స్నేహితులతో మాట్లాడ్డం, ఇవన్నీ ఎందుకూ కొఱగానివాళ్లు ఏపనీ లేకపోబట్టి చేసేపనులనీ, అధమం తన పేకాటపాటి అయినా చెయ్యవని ప్రబలమైన విశ్వాసం కలిగి ఉండడము.

సరే కారణాల కేమి, అలా పేర్చుకొనిపోవచ్చును. అయితే ఈ తాను చెప్పుకొన్న కారణాలు ఒక్క తనకు మాత్రం వర్తించేవా, ఇతరులకు కూడా వర్తించే టటువంటివా? లోకంలో చాలామంది భర్తలకంటె సుబ్బారావు చాలా అంశాల్లో నయం. అయినా, అంతమాత్రంలో, తనకు ఈ దాంపత్య జీవితం అసహ్యకరంగా ఉండడానికి అభ్యంతరం ఏమిటుంది? తన వ్యక్తిగతమయిన ఉద్దేశాలు ఇష్టానిష్టాలు తనవి. వాటికి ఇతరులతోడి సాపేక్షవలన ఏమీ ఉపయోగం లేదు.

అయితే ఇప్పుడీ విధంగా తాను వెళ్లిపోతే జనవాక్యం ఏ విధంగా ఉంటుంది? అందుకు తాను వెరుస్తుంది, లేదు, అది వేరే అంశం. కాని, ఒక పని చేస్తే దాని ఫలితం ఏవిధంగా ఉంటుందో ఊహించుకోవడంలో పొరపాటేం లేదుకదా!

సుబ్బారావులో తను చూస్తున్న లోపాలను చూడలేకపోడమే కాకుండా, ఈ రకంగా తాను విడిచివెళ్లిపోడం మూలంగా అతణ్ణి ఆదర్శప్రాయుడయిన భర్తగానే చలామణీ చెయ్యగలదు లోకం. తనవంటి చదువుకొన్నదానిని చేసుకోడంలో అతడు చాలా తెలివితక్కువ పని చేసేడని చాటుగా మాటుగా అనుకొనే అతడి ఆప్తవర్గానికి తమ జోస్యం ఫలించిన తృప్తి విశేషంగా కలిగితీరుతుంది. తను భర్తను విడిచిపెట్టి వెళ్లిపోవడం అన్న ఒక్క కారణాన్ని ఆధారం చేసుకొని, తనలో ఏ కోశానా లేని ఎన్నెన్నో క్షుద్రపుటూహలూ ఉద్దేశాలూ గుణగణాలు అంటగట్టబడతాయి. అంతే కాదు, తనతో పాటు ఈ అపప్రధాభారాన్ని అకారణంగా సుందరంకూడా భరించాలి. పోనీ, అతను ఇందువల్ల ఏమైనా ప్రతిఫలం ఆశిస్తున్నాడంటే, అదీ లేదు. కేవలంతనకు సహాయం చెయ్యడం నిమిత్తం, అతడు అపవాదును, అందులోనూ మిత్రద్రోహం కూడా మిళితమయిన దానిని, అకారణంగా భరించాలంటే అది అన్యాయంకాదా! తీరా చేసి వెళ్లిపోయిన తర్వాత, ఇప్పుడు సుబ్బారావుమీద ఆధారపడినట్లే, నిస్సహాయంగా సుందరంమీదే అన్నిటికీ ఆధారపడడంకంటె, తాను మరొక కార్యక్రమం ఏదీ నిశ్చయపరచుకోలేదు. సుందరం సుబ్బారావుకంటె మానసికంగా చాలా అభివృద్ధిచెందినవాడే. అయితేమాత్రం, ఇప్పుడిల్లా దూరంనుండి మెరుపులా కనిపించినట్లు కాకుండా పూర్తిగా అతని మీదనే ఆధారపడి

ఉంటున్నప్పుడు, అప్పుడు ఇంత శాంతంగాను సరదాగాను ఉండగలడా? అలా కోరడం మానవ స్వభావానికి సాధ్యమైనకంటె, ఎక్కువగా వాంఛించడం కదూ? సుబ్బారావు తన గురించిన సర్వ బాధ్యతలూ వహిస్తున్నాడంటే, అతనికి తాను ఏవిధమయిన కృతజ్ఞత చూపించలేక పోయినా, అధమం, అతనికి తన భార్య అనే హక్కయినా ఉంటున్నది. కాని, ఇప్పుడనుకొన్న ప్రకారం లేచిపోవడం జరిగితే అందువల్ల సర్వమూ ఇచ్చే వాడు సుందరం, పొందేది తానూ అవుతుంది. తనవల్ల అతడు పొందగల ప్రతిఫలం ఏలవవేశమూ లేకుండా, అతనిమీద తాను సంపూర్ణంగా ఆధారపడి ఉండడంకంటె నీచతరమయిన స్థితి ఇంకేముంటుంది? ఈ ప్రయాణపు వైనం విన్న తర్వాత ఏ యువతి రేపు అతన్ని నిర్భయంగా వివాహం చేసుకోగలదు? ఇదంతా కేవలం స్వప్రయోజనార్థం సుందరాన్ని అతని భవిష్యత్సుఖజీవితాన్ని త్యాగం చెయ్యడంకంటె వేరే ఏమీ కాదు.

అంతేకాని, తానింకొక ముఖ్యమయిన విషయాన్ని గూర్చి ఆలోచించలేక పోతున్నది. వంచితులయిన భర్తల, కేవలం వంచితుడు కాకపోయినా భార్య ఇంకొకడితో లేచి వెళ్లిపోయిన భర్తల ప్రవర్తన ఎన్నెన్ని వింత వింత, పంథాలు తొక్కగలిగిందీ తనకు తెలియనిది కాదు. అటువంటి పరిస్థితిలో, సామాన్యంగా మానవుడు చెయ్యని ఎన్నెన్ని రాక్షస కృత్యాలయినా జరగడానికి సావకాశం ఉంది. అట్టి ప్రమాదం, తనకు ఎల్లానూ తప్పదు. మరి సుందరాన్ని కూడా అందుకు గురి చెయ్యడం ఏమి న్యాయం?

సుందరం వంటబ్రాహ్మణుడు సుబ్బయ్య వచ్చి, తలుపుతీసి ఉండడంవల్ల, పక్లో భోజనపదార్థాలు వంటింట్లో పెట్టి, మెట్లెక్కి వచ్చి "అమ్మా, భోజనం తెచ్చేను. తలుపు తీసిఉంది, వేసుకోండి" అని చెప్పి మెట్లుదిగి వెళ్ళిపోయేడు. వెంటనే దిగి వెళ్ళి, గడియవేసి, నిద్రలో నడుస్తున్న మనిషిలాగ మళ్లీ డాబామీదికి వచ్చి కూర్చుంది.

వెన్నెల స్వచ్ఛంగానే ఉంది, గాని, కొద్దిపాటి చలిఅనదగిన చల్లదనం లేకపోలేదు. అయినా క్రిందకు దిగిపోవాలనిగాని, అధమం కొంచెం వెచ్చగా ఏదయినా కప్పుకోవాలనిగాని, ఆమెకు బుద్ధిపుట్టలేదు. అలాగే కూర్చుంది. కాని, ఆలోచనా సూత్రం మాత్రం తెగిపోయింది.

ఇటువంటి స్నిగ్ధశీతలమయిన వెన్నెలలోనే తాను మొట్టమొదటిమారు సుబ్బారావును చూసింది. అప్పటికీ ఇప్పటికీ మనిషిలో ఎంత భేదం వచ్చేసింది? తనలోనూ కొంతభేదం ఉండకపోదుగాని, తనకది అంత సులభంగా గోచరించదు. తప్పులెన్నువారికి తమ తప్పులు కనిపించసాగాయంటే, వాళ్లు మరి ఇతరుల తప్పు లెంచే పనికి అనర్హులు కాకతప్పదు. తమ తప్పులు కనిపిస్తూనే ఉన్నా, వాటిని సాధ్యమయినంతవరకు మరిచిపోవాలి; ఆ విద్యలో నిజంగా సుబ్బారావు ఉత్తీర్ణుడు కాబట్టే, అంత నిర్విచారంగా తను చేస్తున్నది ఉత్కృష్టమయిన దేశసేవ అని నమ్మకోగలుగుతున్నాడు. అలాగే తాను దైనికావసరాలకు లోటులేని సామాన్య గృహిణి అనీ, తనకంటె ఎందరో ఎన్నో మడుగులు తక్కువవారనీ తాను తృప్తిపొందలేకపోవడమే తనలోని పెద్దలోటు. అయితేమాత్రం లేనిసౌఖ్యం ఉందనుకొనే ఆత్మవంచన మూలకమయిన తృప్తి ఎంతకాలం నిలుస్తుంది?

ఇక్కడి ఈ జీవితాన్నీ అసంతృప్తినీ వదల్చుకోవాలనే ప్రయత్నంలో తాను వేరే మరి కొన్ని బంధాలకు, చిక్కులకు లొంగిపోదని హామీ ఏమీ లేదు. ఒకప్పుడు ఇంతకంటె హీనమయిన పరిస్థితులను ఎదుర్కోవలసి రావచ్చును. తన ఉనికికి ఈ మాత్రం నిర్భయత, నిరపాయత కూడా ఉండకపోవచ్చును. తన గౌరవాన్ని కాపాడుకొనే ప్రయత్నంలో తాను ఏదయినా తొందరపాటుపనులు చేయవచ్చును. వాటి ఫలితంగా ఎన్నాళ్లో వ్యథననుభవించవచ్చును. అయినా ప్రమాదపుసావకాశాలన్నీ ఇతరులకంటె తనకే బాగా తెలుసును. అయినా తననిశ్చయం మార్చుకోడం పిరికితనమూ, కార్యనిర్వహణ తత్పరత లేకపోడముకంటె వేరేమీ కాదుకదా! ప్రమాదాలు జరగడానికి సావకాశం ఉంటున్నాదికదా అని ప్రయాణము,విమాన ప్రయాణాలు సైతం మానుకొంటున్నారా? అలాగే తన ప్రయాణమున్నూ. భవిష్యత్తు ఎలా ఉంటుందీ ఎవ్వడూ చూసివచ్చినది లేదు. ఎవరు చేసినా ఊహ మాత్రమే. కాక, ఏవో ప్రమా

ణాలు లీలగా కనిపిస్తుంటే మాత్రం, వర్తమానంలోని సమస్యలను సక్రమమార్గాన పరిష్కరించుకోకపోతే ఎలాగ?

ఇప్పుడింత నిశ్చయంగా ఉన్న అభిప్రాయాలే, అతను, సుందరం, వచ్చేసరికి మాత్రం ఎందుకంత అనుమానాస్పదంగా తనకే నిశ్చయం లేనట్టుగా తయారవుతాయో? సరే, ఇక మరి సందేహం లేదు, అంతా నిశ్చయం అయిపోయినట్టే. అయ్యో పాపం, అతను సినీమాకు బయలుదేరి వచ్చే వేళయింది, తానింకా ఇలాగే కూర్చుంది. లేచి వేగం తెమలాలి...అదుగో, బండి రానే వచ్చింది. కానీ అతను వచ్చికూర్చున్నాకే లేవవచ్చును భోజనాదికానికి.

ఈమారు తలుపు తియ్యగానే అతను ముందుగా మెట్లెక్కొచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఆమె తరువాత వచ్చి తన కుర్చీలో కూర్చొంది.

సుందరం: మరి ఆలస్యం ఎందుకు, సుమారు వేళయింది; బయలుదేరుదామా?

సుమిత్ర: అలాగే నేను సిద్ధంగానే ఉన్నాను. ఇలా రమ్మంటే ఇలాగే వచ్చేస్తాను. కాని, మీపని మనిషిని వెంటపెట్టుకొని వచ్చేవేమో నని నలుగురూ అనుకోకుండా ఉండే నిమిత్తం మరొక చీర కట్టుకొందికి వ్యవధి ఉంటే...

సుందరం: అంటే. ఆమాత్రం అవసరం గుర్తించే స్థితిలో ఉన్నారన్న మాట. మధ్యాహ్నంనుండి, కదలిక లేకుండా పరధ్యానంగా కూర్చోడాన్ని బట్టి చూస్తే, చీర మంచిది కట్టుకోడమూ సామాన్యంగా నయినా అలంకరించుకోడమూ లేశమయినా అవసరం లేనివని తేలింది. అందుకు తోడు భోజన ప్రయత్నం కూడా చెయ్యకపోడం వింతగానే రూపించింది. ఏమైతేనేమి, నీఅంతట నువ్వే మామూలు లోకానికి వచ్చి అలంకరణావసరాన్ని గుర్తించేవు కాబట్టి ఆ వరసనే, భోజనంకూడా కానిస్తా వని నమ్ముతున్నాను. రేపు రైలులో సరిగా భోజనం ఉండదు కదా అని, ఇలాగే, రేపటికికూడా సరిబడేంతగా తినడానికి వీలయినట్టు వండమన్నాను. అందులో నాకు మరీ నచ్చినవి, నీకు నచ్చుతాయో లేదో తెలియదు, నీకోసం ప్రత్యేకించి పంపించేను. నా యీ అహంభావాన్ని తుష్టి పరచడం నిమిత్తం అయినా తినకూడదా?

సుమిత్ర: తినడానికి చాలా చిత్రమయిన కారణం చెప్పావు; ఇంకా చిత్రమయినవి ఎన్నో చెప్పవచ్చునేమో? కాని, నాకు తెలిసింది మాత్రం ఒక్కటే కారణం; అది ఆకలివెయ్యడం. అయితే ఇందాకా పరధ్యానంగా కూర్చుంటే అట్టే లేదు గాని, ఇప్పుడు ఆకలికూడా బాగానే వేస్తోంది. అందుచేత నీ బలవంతం, బహుమానం విశేషం అక్కర లేకుండానే భోజనం చేస్తాను. ఒకళ్లు పదిమార్లు బలవంతంచేసినప్పుడు నిజంగా కావలసిన వస్తువయినా అక్కరలేనిదిగానే కనిపిస్తుంది. కాని, వాళ్ళు తీరా ఇవ్వమనేసరికి ఎక్కడలేని ఆశాభంగమూను...సరేమరి కబుర్ల కేముంది, ఆలస్యం అయిపోలేదు కదా. నేను భోజనం కూడా చేసివచ్చేసరికి వేళ ఉంటుందా?”

సుందరం: ఎందుకుండదూ? ఆ బాధ్యత నాది. ముందుగా నువ్వు భోంచేసిరా. అలాగని తొందరపడి అర్ధాకలిగా లేవకు.

సుమిత్ర: ఏకంగా మానేస్తే మానెయ్యాలిగాని భోజనం దగ్గర కూర్చొన్న తరవాత మొగమాటం పడడ మన్నది వట్టి చాదస్తం. మరెందు కాలస్యం ఇప్పుడే వస్తాను. నీకు పేపరుగాని, పుస్తకంగాని ఏమయినా కావాలా?

సుందరం: ఏవీ అక్కర్లేదు. నువ్వు వేగం తయారయివస్తే చాలును.

మరి ఈ మాటకి ఏవీ సమాధానం చెప్పకుండా సుందరం కుర్చీదగ్గరకి కాళ్ళుపెట్టుకోనే బల్లఒకటి లాగి, విశ్రాంతిగా కూర్చోఅని చెప్పి, అతనిమాట వినిపించుకోకుండానే కిందికి దిగి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్లిపోగానే అతను చేతివాచీ వంక చూసేడు, తొమ్మిదీ ఇరవై; అంటే తన వాచీ కావాలని పదిహేనునిమిషాలు ముందుగా ఉంచేడు. ఆమె భోంచేసి అలంకరించుకొని రావడం తన వాచీ ప్రకారం తొమ్మిదీ నలభైఅయిదయినా ఇంకా కావలసినంత వేళుంటుంది. లేకపోతే మాత్రం ఇప్పుడు సినీమా చూడ్డం అంత ప్రధానమయిన సంగతి కాదు కదా! కాని, ఏమో, సుమిత్ర ధోరణి మాత్రం వింతగా ఉంది; అసలు ప్రయాణానికే సుముఖంగా ఉన్నట్టులేదు. సరే ఆ విషయంలో తానేమీ బలవంతపెట్టలేదు. ఆమె ఇష్టప్రకారం

జరగవలసిందే. అన్నం తింటానంది గాని, నిజంగా తింటుందో తినదో; వెళ్లిచూస్తే, నామాటమీద నమ్మకం లేకపోయిందా అని కోపం రావచ్చును. ఏమీ మాట్లాడకుండా ఊరుకోడమే కర్తవ్యం.

ఆమె సిల్కుచీర, ఇతర అలంకరణమూ అతని కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఆమెను తెలిసిన రెండు సంవత్సరాలలోనూ ఎన్నడూ కనబడనంత కొత్తగా అందంగా కనిపించింది సుమిత్ర. పోనీ అక్కడితో ఊరుకోందా; "ఎలా ఉన్నాను సుందరం?" అంది. అతనికి వెంటనే ఏమీ సమాధానం స్ఫురించలేదు. కొంచెం సర్దుకొని, "ఏం చెప్పమన్నావు? నేనేమి చెప్పినా అత్యుక్తిగానే ధ్వనిస్తుంది. అయినా ఇంతకీ, ఈ అరగంటసేపూ నీ ఎదురుగా నిలబడి, మూగ భాషలో నీతో మాట్లాడిన నీ నిలువుటద్దం కంటె యథార్థం ఎవరు చెప్పగలరు?" అన్నాడు ఎటూ దొరకకుండా.

"మొత్తానికి నీమాట ఏమిటో నాకర్థం కాలేదు గాని, అసలు సినీమాకి వెళ్లడం ఉందంటూరా లేదా?"

"నీ సౌందర్యాన్ని నేనొక్కణ్ణే చూచితీరాలన్నంతటి స్వార్థపరుణ్ణి కానులే పద."

"అంటే ఏమిటి నీమాట కర్థం? నన్నొక ప్రదర్శనపు వస్తువుగా థియేటరులో కూర్చోమనా? ప్రదర్శనాలలోని వస్తువులనయినా, తగిన మూల్యం చెల్లించి ఏ ఒక్కరో స్వంతం చేసుకోవచ్చును. కాని, నీ ఉద్దేశం ప్రకారం, నేనుమాత్రం అమూల్యంగా అంటే లేశమయినా మూల్య మన్నది లేకుండా, పడిఉండా లన్నమాట. ఏమంటావు?"

"ఇందుకు సమాధానం నేను ఇప్పుడే చెప్పాలా? దార్లో జట్కాలో నిదానంగా చెప్పవచ్చునా?"

"ఏదైనా పనిచేసేవాడికి ఒకటే పద్ధతి గాని, తప్పించుకొనేవాడికి అనంతమయిన పద్ధతులు."

తరువాత నాడు జట్కాలోనూ సినీమా హాల్లోనూ ఉన్నంతసేపూ ఆమె అదివర కెన్నడూ లేనంత ఉత్సాహంగా ఉల్లాసంగా కబుర్లు చెప్ప సాగింది. సుందరానికి కూడా సామీప్య ఫలితంగా తన నిరంతర నిరుత్సాహముద్ర సడలి నూతనోత్సాహం కలిగింది. ఆమె ఏమందో తానేమని సమాధానాలు చెప్పేడో అన్ని మాటలూ స్పష్టంగా జ్ఞాపకం లేవు అక్కడక్కడ కొన్ని తప్ప.

"సుందరం! ఇలా మనమిద్దరం ప్రక్కప్రక్కను కూర్చుంటే, ఈ ఊళ్ళోఅంతా తెలిసినవాళ్ళు గనక ఫలానా ఇనస్పెక్టరుగారి భార్య, సుందరం బాబు గారు అని తెలుసును, గాని, ఎవళ్లయినా కొత్తవాళ్లయితే ఏమనుకొంటారు? ఇంత చక్కటి చిన్న కుర్రవాడు ఇంత ముసలిపెళ్లాన్ని ఎందుకు చేసుకున్నాడు చెప్మా అని అనుకోరూ?"—అందుకు తాను వెంటనే ఏమీ సమాధానం చెప్పలేకపోయేడు. తరవాత కూడా ఏమి చెప్పేడో సరిగా జ్ఞాపకం లేదు. ఆమె ఈ రకంగా మాట్లాడుతుందని తాను స్వప్నేపి ఊహించలేకపోబట్టే వెంటనే ఏమీ సమాధానం చెప్పలేకపోయేడు. కాని, ఆమె చేసిన ఊహలో విశేషం పొరపాటులేదు. తనూ ఆమె కలిసి ప్రయాణం చేస్తే, కలిసి ఒక ఇంట్లోనే ఉంటే, ఏమనుకొంటారు లోకులు? తప్పక భార్యాభర్తలనే అనుకొంటారు. అయితే ఆమె మాటలోని చివరి భాగం మాత్రం తమాషాకి అన్నదే. తనమట్టుకు తాను మొదట్లో ఆమె వయస్సు ఇరవై దాటిందంటే నమ్మలేకపోయేడు, ఎంతో విశ్వసనీయమయిన ఆధారాలు చూసేవరకు. ఇప్పుడయినా ఆమెకు మహా ఎక్కువ వేస్తే పాతికకంటె ఎవరూ ఎక్కువ అంచనా వెయ్యరు. నిజానికి కూడా ఆమె వయస్సు ఇరవై ఆరే. అంటే తనకంటె బాగా ఆరేళ్ళు చిన్న. నిజంగా ఆదర్శదంపతుల నడుమ ఉండవలసినపాటి వ్యత్యాసమే ఉంది, తమ వయస్సుల నడుమను.

అంతసేపూ ఆమె సందిగ్ధస్థితిని విమర్శించిన సుందరానికి తీరా సినీమా హాల్లో కూర్చున్నప్పుడు కొద్ది గంటలలో తాను చెయ్యవలసిన ప్రయాణం సంగతి ఏమీ స్పష్టంగా ఊహించ బడకుండా అయిపోయింది. కాని సుమిత్ర వైఖరి చూస్తేమాత్రం, మరి ఇందాకటి అనుమానాలు ఏవీ ఉన్నట్టు లేవు. అందుకే ఇంత ఉల్లాసంగా మాట్లాడ గలుగుతూంది.

మాటలలో వెనుకబడినా చేతలలో మాత్రం వెనుకంజ వేయలేదు సుందరం. హాలునుండి బైటకు రాగానే, మామూలు ప్రయాణాలకు సంబంధించిన వ్యావహారికపు జగత్తులో పడ్డాడు. నౌఖరు రాముడుకి స్టేషనుకి వెళ్లి రెండు సెకండు క్లాసు టిక్కట్లు తీసుకొని ఉంచమని డబ్బిస్తూ ఉండగా సుమిత్ర వారించింది. ఎలా గూస్టేషనుకి వెళ్తూ, "ఇంతలో

ముందుగా వెళ్లి టిక్కెట్లు కొనమనడం ఎందుకు? వెళ్లిన తరవాత నే కొనుక్కోవచ్చును" అంది.

ఆమెను కాదని లాభంలేదని సుందరం ఊరుకొని జట్కాలోకి ఎక్కి పోయేడు. రాముడు మామూలుగా నడిచేకంటె నెమ్మదిగా, తల గోక్కుంటూ నడవసాగాడు. జట్కా బండి గలగలలాడుతూ నడక సాగించింది.

సుందరం దారిలో అన్నాడు. "ఇప్పుడే మరొక బండీకూడా తీసుకొంటే, మనకొకటి, సామానుకొకటీ పనికి వస్తుంది. నీవి రెండు పెట్టెలకంటె ఎక్కువ ఉండవనుకొంటాను, పరుపు దుప్పట్లు మొదలయిన వేవీ నువ్వు పట్టుకో నక్కర్లేదు. అవన్నీ నేను ఏర్పాటు చేసేను. నీకు అతి అవసరంగా కావలసిన కొద్దిపాటి బట్టలు వస్తువులు పట్టుకొంటే చాలును. అటువంటివి కూడా నీకు ఉపయోగిస్తాయని నాకు తోచినవి కొన్ని కొన్నాను. మరేమయినా కావలసినా అక్కడకు వెళ్ళేక కొనుక్కో వచ్చును. ఏమంటావు?"

సుమిత్ర వెంటనే తన నిశ్చయాన్ని తెలియజేయలేకపోయింది. అందుకు బదులుగా ఏదో ఒక ప్రశ్న వేసింది. "అయితే ఇప్పటి మన ప్రయాణపు ఉద్దేశం ఏమిటి?"

"అదంతా మళ్ళీచెప్పించగలమా? నీకు ఇక్కడి జీవితం అంటే రోతగా ఉంది అందుచేత."

"ఈ రకంగా స్త్రీలందరూ జీవితం ఏమో మహా ఆనంద దాయకంగా లేదని సంసారాలను విడిచి పోయేమాటైతే, మరి సంఘం గతి ఏంగాను?"

"వ్యక్తులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకొనే సందర్భంలో సంఘం మొత్తం గురించి ఆలోచించకూడదని నువ్వే చెప్పినట్టు జ్ఞాపకం."

"అంటే నేను ఎప్పుడెప్పుడో అనాలోచితంగా అన్నమాటలు భగవద్గీతలోని శ్లోకాలలా జ్ఞాపకంగా ఉంచుకోవలసిన వన్నమాట?"

"విలువయిన మాటలు ఎప్పుడు ఎవరి ముఖతః విన్నా జ్ఞాపకం ఉంచుకోవలసిందే. అయినా జ్ఞాపకం ఉంచుకోవా లనుకొన్న మాటలన్నీ జ్ఞాపకం ఉండవు; కొన్ని కొన్ని మాటలు అప్రయత్నంగానే జ్ఞాపకం ఉండిపోతాయి. అందుకు సమయము, స్థలము సందర్భము– అన్నిటికంటె ముఖ్యంగా ఆ మాటలు అన్న వ్యక్తి, ఇవన్నీ కారణ భూతములు కావచ్చును. సరే మరి ఈ పిష్టపేషణ మెందుకు? ఇక్కడనుండి నీకు వెళ్ళిపోవాలని ఉంది. అందులో నా దృష్టికి ఏమీ పెద్ద పొరపాటు గోచరించడం లేదు. ఈ సందర్భంలో నాచేత నయిన సహాయం చెయ్యడం నా విధి అనుకొంటున్నాను. అందుకు తోడు ఇందులో నా స్వార్థంకూడా ఒకింత ఇదివరకు అంగీకరించనిది మిళితమయి లేకపోలేదు."

"ఏమిటేమిటి?" అంది తన ఆతృత నణచుకొందికి ప్రయత్నిస్తూ సుమిత్ర—

"నీకు తెలియనిదికాదు. నీకు పత్రికా నిర్వహణంలో ఎంత ఉత్సాహం ఉందో నాకూ సుమారు అంతే ఉంది. అయితే నా అంతట నేను అటువంటి వ్యవహారం సాగించలేనని పూర్తిగా తెలుసును. కాగా, నువ్వు సంపాదకత్వపు భారం వహిస్తానన్నావు; ఇక తక్కిన తాపత్రయం అంతా నేను పడగలను. మన స్వల్పశక్తికి అనుగుణంగా ఏకొంచమో, దేశసేవ అంటే నీకిష్టంలేదు, మానవసేవ చేసే ప్రయత్నం చేస్తాం. ఇంతంటె మరే కారణం కావాలి ప్రయాణానికి. ఇదంతా నీకు తెలియనిది కాదు ఊరికే మళ్ళీ మళ్ళీ నన్ను పరీక్ష చెయ్యడానికి ఇల్లా వాగిస్తూ ఉంటావు."

"అదేంకాదు సుందరం. కాని నాకు ఒక్కటే తమాషాగా కనిపిస్తుంది. నువ్వేమో పత్రికా స్థాపనకీ నిర్వహణకీ సర్వథా సమర్థుడవే, అయితే నీ స్థాపించబోయే పత్రికకి సంపాదకత్వం వహించడానికి ప్రతిభాశాలురు కారు చౌకగా దొరికే ఈ దేశంలో నేనే నీకు కనిపించడం చిత్రంగా లేదూ? నువ్వియ్యబోయే ఉద్యోగానికి నాకు గల అర్హత లేమిటి? వెనక ఎప్పుడో కాలేజీలో చదువుకొనే కృతయుగపు రోజుల్లో అందరికీ అతి సామాన్యంగా కలిగి పాతబడిపోయిన అభిప్రాయాలను పూర్వపు నాటకాల ధోరణికి కాంగ్రెసు ఉపన్యాసాల ధోరణిని మిళితం చేసి సమాసాలు యతిప్రాసలు పేర్చుకొని రాసినవే కదూ. ఆమాత్రపు రచనలకే ప్రాముఖ్యం ఇచ్చి ఎవ్వరూ ఒక పత్రికా సంపాదకుణ్ణి నిర్ణయించుకోరనుకొంటాను. అంతకంటె నువ్వు—నేను తియ్యబోయే సినీమాలో నువ్వు నాయిక వేషం వెయ్యాలి.

అంటే కొంచెం నమ్మడానికి సావకాశం ఉండును. ఏమంటే బుద్ధి కుశలతకి ఉన్నపాటి స్పష్టమయిన శోధన సాధనాలు అందానికి లేవు గనక, ప్రతివ్యక్తికీ తన బుద్ధి కుశలత మీద కంటె అందం మీద ఎక్కువ మనుకారం ఉండడానికి సావకాశం ఉందికదా?''

"బాగానే ఉంది. నీ శక్తి సామర్థ్య ముల విషయం నీకు తెలిసిన కంటె నాకు బాగానే తెలుసును. అంతగా నీకు తలకు మించిన పనిగా రూపిస్తే అప్పుడు మరొక విధంగా సర్దుకోవచ్చును. అంతే కాని ఇప్పుడే అనవసరపు అనుమానాలు పెట్టుకొంటే ఏం లాభం? మనం మాటల్లోపడి చూడనే లేదు, మీ యిల్లు వచ్చేసింది. నీసామాను పట్టుకొని, మాయింటికి వెళ్ళిపోతే, అక్కడ తక్కిన సామాను తీసుకొని స్టేషనుకి వెళ్ళిపోవాలి. అట్టే వ్యవధికూడా లేదు.— అని అతను జట్కా దిగేడు. వెంటనే ఆమె ఏమీ మాట్లాడకుండాదిగి కొత్తగా పరిచయమయినరోజుల్లో లాగ, రెండు చేతులూ జోడించి తలవంచి నమస్కరించి, ''సెలవు'' అంది.

అతనికేమీ అర్థం కాలేదు. తన గాభరా సర్దుకొని, ఏమో అడుగుదామనుకొంటూ ఉండగా, ఆమె అంది.

''సుందరం, నేను సకాలంలో ఒక నిశ్చయం చేసుకోలేకుండా నీకనవసరంగా శ్రమ కల్పించినందుకు, నీకు ఎంతగా కోపం వచ్చినా, చివరికి నన్ను క్షమించలేకపోవు. మరి మన ప్రయాణం జరిగేసంగతి కాదు. నువ్వు వెళ్ళి నన్ను గురించి తిట్టుకోవలసినంతగా తిట్టుకొన్న మీదట హాయిగా నిర్విచారంగా నిద్రపో, నీ స్నేహ ధర్మానికి ఎటువంటి లోటూ లేదు. ఆ విషయంలో నువ్వు విచారించవలసినదేమీ లేదు. ఒకటే నా విచారం, ముందుగా అధమం సాయం కాలండాబామీదనయినా నేను ఈ మాత్రం స్పష్టంగా నీతో చెప్పలేకపోడం. మరి సెలవు"...అని ఏమాత్రమూ తడబాటులేకుండా మెట్లెక్కి తాళంతీసి తలుపు తెరుచుకొని, లోపల ప్రవేశించి గడియవేసుకొనే ముందు "మరి నువ్వు వెళ్ళు, ఎందుకుమంచులో నిలబడడం, సెలవు" అంది, ఆమె గడియ వేసిన చప్పుడూ, లోపలిపద ధ్వనీకూడా వినిపించకుండా పోయిన తర్వాతగాని, అతనికి తనను గూర్చిన ఆలోచన కలగలేదు. నాటకం చూస్తూ, తనఎదుట ఎటువంటి రసవత్తరమయిన సంఘటనలు జరిగిపోతున్నా, తాను మూగగా కూర్చొనడమే గాని, ఏ విధమయిన చలనమూ కనపరచలేని ప్రేక్షకుడిలా అయిపోయేడు తాను ఆమె ఎదురుగ ఉన్నంతసేపూ. ఎక్కడో ఎప్పుడో జరిగిన సంఘటనగానే తప్ప, ఇప్పుడే ఇక్కడే తనకి సంబంధించిన సంఘటన ఈ విధంగా సమాప్తమవుతున్నదనే స్ఫురణ లేకుండా పోయింది. మాట్లాడకుండా జట్కా ఎక్కి కూర్చున్నాడు; జట్కా వాడికే కాదు, గుఱ్ఱానికికూడా అర్థమయినట్టే వుంది తన పరిస్థితి. నెమ్మదిగా నడిచి తమ మేడ వద్ద ఆగింది. పరధ్యానంగా జేబులో డబ్బులు తీసి ఇచ్చి వెళ్ళి మంచంమీద పడుక్కొన్నాడు. ప్రయాణం నిశ్చయమయిన కారణాన కాబోలు, రాముడు పక్క సరిగా దులిపి పరవలేదు. అయినా ఇప్పుడు సర్దుబాటు చేసుకోడం అంత సులభంగా సాధ్యమయేదా? ఈ రాత్రికి ఎలాగో గడిపెయ్యాలి. మధ్యాహ్నం అంతా శ్రమించి తాను కొని చక్కగా సర్దుబాటుగా కట్టిన ప్రయాణపు సామాన్లు తనను హేళన చేస్తున్నట్టు కనిపించడంతో, కిటికీ వంక తిరిగి పెరటి తోటలోని పువ్వుల మొక్కలమీది గాలిని అనుభవించడంలో తనను తాను మరిచిపోవా లనుకొన్నాడు. ఎంతోసేపు మేలుకొని ఉన్నట్టనిపించింది కాని, ఒక అరగంటలోనే నిద్రపట్టిపోయింది.

నిద్రలో తాను రైలులో ప్రయాణం చేస్తున్నట్టు, తనతో కూడా ఎవరో ఉన్నారు గాని, ఆ ఎవరో సరిగా తనకే తెలియనట్టు, అంతలోనే రైలుబండికి నిప్పంటుకొన్నట్లు, ఏమిదారి ఏమిదారి అని అందరితోపాటు తాను హడావుడిపడినట్లు, వెనుక ఎప్పుడో గోదావరిమీద పడవలో వెళ్ళినట్లు, తానూ సుబ్బారావు వెళ్తున్నట్లు, ఎవరో నీటిలో మునిగి పోతున్నారని సుబ్బారావు కేకలు వేస్తున్నట్లు, తాను నీటిలో దూకితే ఎంత చలిగా ఉంటుందో అని ఒక్క క్షణం తటపటాయించి దూకినట్లు, తరవాత ఎవరో ఆడ మనిషి కనబడకుండా తనని పిలుస్తున్నట్టు, ఎటు చూసినా ఎవ్వరూ కనబడనట్టు, అయినా స్పష్టంగా ఎవరో తననే పేరు పెట్టిపిలుస్తున్నట్లు...ఎన్నెన్నో చిత్ర చిత్రమయిన కలలు వచ్చేయి.

కలలెన్ని వచ్చినా, మధ్యలో మాత్రం పూర్తిగా మెలకువ రాలేదు. ఉదయం కూడా మామూలుకంటె

బాగా ఆలస్యంగానే మెళకువ వచ్చింది. తరవాతనయినా అతనిచర్య యావత్తూ నిద్రలో నడిచే మనిషి చర్యలాగే ఉంది. రేడియో ఎంత పెద్ద ధ్వనితో మ్రోగుతున్నదీ అంత దగ్గరలో కూర్చున్నా అతనికి సరిగా తెలియలేదు. చూస్తున్న పత్రికలోని పెద్ద క్షరాలలో ఉన్న వార్తలను ఒక మాటు చదివినవి మళ్ళీ పేజీ తిరగవేసే సరికల్లా మరిచి పోతున్నాడు. రాముడూ సుబ్బయ్యా చెప్పిన మాటలకు ఉచితమయిన సమాధానాలే చెప్పినప్పటికీ, ఆ తరవాత వాళ్ళేమడిగినదీ తానేమిచెప్పినదీ గుర్తులేదు. ఉదయం పదిగంటలవుతూ ఉండగా రాముణ్ణి పిలిచి "ఒరేయి, రాత్రి సరిగా నిద్రలేదు. బద్ధకంగాను, తలదిమ్ముగాను ఉంది. బాగా తల అంటగల మంచి మంగలి వాణ్ణి తీసుకొనిరా," అన్నాడు. అభ్యంగనమూ, భోజనమూ అయిన వెంటనే అట్టే ప్రయత్నం అక్కర లేకుండానే ఆశించిన కంటె గాఢంగానే నిద్ర పట్టింది.

మధ్యాహ్నం మూడు గంటలకు లేచి, మొగం కడుక్కొని సుబ్బయ్య తెచ్చిన కాఫీ తాగుతూ ఉండగా, రాముడు తెచ్చి ఇచ్చేడు మధ్యాహ్నం తాను నిద్రపోతూ ఉండగా వచ్చిందని ఒక కవరుత్తరం.

మొదట పరధ్యానంగా టేబిల్ మీద పడెయ్యమన్నాడు; కాని, అంతలోనే మళ్ళీ బుద్ధి పుట్టి సుబ్బయ్యను అందుకోమన్నాడు. సందేహ మేమీ లేదు, ఇంత చక్కని దస్తూరీ సుమిత్రకు తప్ప తనకు తెలిసినవాళ్ళలో మరెవరికీ లేదు. అయితే ఏమో తరవాతగాని ఉద్దేశం మార్చుకొందేమో, అయినా ఇక్కడికిక్కడికి ఉత్తరం రాస్తుందా, ఎన్నడూ అటువంటి అలవాటు లేదే. కాఫీ తాగడం తొందరగా ముగించి, సుబ్బయ్యను పంపించి చదవడం మొదలు పెట్టేడు, మొదటిమారు ఎంత శాంతంగా చదివినా ఏమో చదివినట్టనిపించలేదు. ఇప్పుడు తాను ఎంత తొందరపడినా ఏమీ ఫలితం లేదు కదా అని సర్దుకొని మళ్ళీ నిదానంగా చదవడం ప్రారంభించేడు

"సుందరం!.

ఈ ఉత్తరం అందే సరికి నేను నీకు చాలా దూరంగా ఉంటాను. ఎట్టఎదురుగా ఉన్నప్పుడు నీతో ఎంతో స్పష్టంగా మాట్లాడాలనే ఉంటుంది. కాని, తీరామాట నోటి చివరికి వచ్చే సరికి, ఏదో తమాషాగా మనకు అట్టే సంబంధంలేని సంగతులు మాట్లాడడమే జరుగుతుంది. ఇందు మూలంగానయినా నీతో నిర్మొగమాటంగా మాట్లాడుదామని ప్రయత్నిస్తున్నాను. రైలుకింకా అరగంటపైగా టైముంది. బైట గుడ్డి వెన్నెల. ఇక్కడ దీపపు వెలుగుకి కూడా నేను అంత దగ్గరగా లేను. అందుకు తోడు మధ్య మధ్యను అటూ ఇటూ నడిచే మనుష్యుల నీడలు. అయినా నా అక్షరాలు (నువ్వు ఎంతో కుదురుగా ఉంటాయని మెచ్చుకొనేటటువంటివి.) చదవబడనంత గజిబిజిగా ఉండవని నమ్ముతున్నాను.

నిన్ను అంత కటువుగా వెళ్ళి పోమన్నాను, నామటుకు నాకే కష్టంగా తోచింది. నేను చేసిన మోసానికి; అయితే ఇందులో పెద్ద దురుద్దేశం లేక పోడాన్ని నువ్వు గుర్తించగలవు.

ఇందాకా సాయంకాలం నీతో డాబా మీద మాట్లాడుతున్నప్పుడు నిజంగానే నాకు ఒక నిశ్చయం అంటూ లేదు. తరవాత ఎప్పుడు కలిగిందో కూడా స్పష్టంగా తెలియదు. కాని, మొత్తానికి నిన్ను ఉంచేసి నేను ఒక్కతెనే వెళ్ళిపోవాలన్న నిశ్చయానికివచ్చేను. సినీమా చూస్తూ ఉండగానే ఎప్పుడో కలిగి ఉండాలి ఈ అభిప్రాయం. అంత వరకూ నేనసలు బయలుదేరుతానా లేదా అనే అనుమానంగాని బయలుదేరేమాటైతే మనమిద్దరమూ కలిసే అని నీలాగే అనుకొన్నాను. సరే దాని మాటకేమి, ప్రస్తుతం నా ప్రయాణానికి కారణాలు నాకు తెలిసినంతగా నీకు తెలుసును. అయితే మొదట అనుకొన్న దానికి విరుద్ధంగా నిన్ను విడిచి పెట్టి. నేను ఒక్కతెనే వెళ్ళిపోడానికి కారణం తెలియజేయడం నా విధి కదా!

నన్ను తెలియక పూర్వం నుండి నువ్వూ సుబ్బారావు స్నేహితులు, నా మూలంగా మీ యిద్దరి స్నేహం భంగం కాకూడదన్న ఉద్దేశం ఒకటి; పోనీ మీ స్నేహం చెడినా, అంతకంటె మనమిద్దరమూ సన్నిహితులము కాగలిగే సావకాశం ఉన్నా మన ప్రయాణానికి నాకు అభ్యంతరం లేక పోయిఉండును. నీకు కేవలం నాకు సహాయంచేసే ఉద్దేశం తప్ప, నా వల్ల పొందగలిగే ప్రతిఫలం అంటూ ఏమీ లేదని స్పష్టంగా చివరివరకూ తెలుస్తూనే ఉంది. అయితే నా అంతట నేను ప్రోద్బలంచేసి నీకు నేను కావాలి

అనిపించుకోడం ఏమంత కష్టమయినపని కాదని నాకు తెలుసును. అయితే ఆవిధంగా నిన్ను నీకు తెలియకుండా దిగలాగడానికి తగినంతగా నేను దిగబడలేకపోయేను.

ఎంతో వేగం రాస్తున్నట్టనిపిస్తున్నా, రాసిన కాగితాలనుబట్టి చూస్తే తాపీగానే రాసి ఉండాలి. రైలు రావడానికి ఇక పది నిమిషాలు మాత్రమే వ్యవధి ఉంది.

నిజంగా నీతో కలిసి బయలుదేరితే, నాకు, నా గురించి ఏమీ ఆలోచించవలసిన అవసరం లేకుండా ఉండును. ఇంతవరకూ నా గురించిన సర్వబాధ్యతలూ భర్త అనే హోదాలో సుబ్బారావు భరిస్తున్నట్టే, అప్పుడు నువ్వు వేరొక హోదాతో భరించి ఉండేవాడివి. అయితే ప్రతిఫలం ఏ మాత్రం పొందకుండా నువ్వు నా గురించి పరిశ్రమించడం నాకిష్టం లేదు.

ఇప్పుడు నా భవిష్యత్తు ఎంత అవకతవకగా ఉండాలో అంత అవకతవకగానూ ఉంది. అయితే నన్ను నాశక్తినీ పరీక్ష చేసుకోందికి ఇంతకంటె మహత్తరమయిన సావకాశం మరొకటి ఉండదు. నేను వెళ్ళి ఏదో ఉద్యోగం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. అయితే నా వంటి ఆదర్శవాదిని అయిన వ్యక్తి, ఎందులోనూ అట్టే కాలం ఉండలేదులే. అంతే కాదు, అసలు ఉద్యోగమే దొరకక పోవడానిక్కూడా వీలు లేకపోలేదు. ఏమీ దొరకక, ఎందుకూ శక్తి చాలదని బుజువయిపోయి, తక్కిన ప్రపంచానికి అక్కర లేకపోయినా, నీ సహాయం మాత్రం తప్పకుండా దొరుకుతుందన్న నమ్మకం మాత్రం బలంగానే ఉంది.

ముందుగా తిన్నగా మాస్నేహితురాలు సుభద్ర పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నది; ఆమె యింట్లో బసచేసి, నా ప్రయత్నాలు సాగిస్తాను. తరవాత సందర్భాన్ని బట్టి ఉత్తరాలు రాస్తాను అవసరంగా ఉంటే.

నీ వేదాంత ప్రియత్వం ఎంత గాఢమయినదో నేను సరిగా ఊహించలేను. అయినా నా దృష్టికి, అన్నీ సమృద్ధిగా ఉన్న నీవంటి వాడు హాయిగా పెళ్ళి చేసుకొని, పిల్లలూ పాపలూ కలిగి ఉండడం ఎంతో ముచ్చటగా ఉంటుంది.

నీవంటి హృదయం ఇచ్చే మిత్రులు దొరకడం నిజంగా అదృష్టమే. మనమైత్రి లోకుల నోళ్ళలో మరొక విధంగా అపవిత్రం కాకుండా, ఈ రకమయిన పరిణామానికి దారితియ్యడం ఒక విధంగా బాగానే ఉంది. ఇందుమూలంగా మనం నష్టం కంటె లాభాన్నే ఎక్కువగా పొందగలము.

ఎంతో స్పష్టంగా ఎటువంటి డొంకతిరుగుడూ లేకుండా మాట్లాడాలనుకొని కూడా ఏమేమో చాదస్తంగా ఇంత గ్రంథం రాసేను. అసలు స్పష్టంగా మాట్లాడుకోడం, రాయగలగడం కూడా ఒక కళే, అది అందరికీ సులభంగా పట్టుబడేది మాత్రం కాదు.

సుబ్బారావుకి ఉత్తరం రాయడానికి ఇప్పుడు వ్యవధి లేదు. రైల్లో కూర్చొని రాస్తాను: మన ఉభయులం కలిసి ప్రయాణం చేయదలచుకొన్న అంశం గురించి రాయడం అనవసరమనుకొంటున్నాను.

ఇంత నిశ్చయంగా ఉత్తరం రాస్తున్నానా, అయినా ప్రయాణం తప్పిపోయినందుకు చికాకు వేసి, నువ్వు ఎక్కైనా వెళ్ళాలని బయలుదేరి రాకూడదా, మనం ఇద్దరం కలిసి, వేరే వేరే లక్ష్యాలతోనే కానీ, ప్రయాణంచేసే సావకాశం ఏర్పడకూడదా అని లోపల్లోపల ఆశ వదలక పోవడంలేదు. తొందరగా గాభరాగా రాసిన ఈ ఉత్తరంలో ఎన్నెన్ని పదగత వాక్యగత, అన్వయగత, దోషాలున్నా నీకు నామనసులోని అభిప్రాయం మాత్రం స్పష్టంగానే అర్థం అవుతుందని నాకు తెలుసును, మళ్ళీ నిదానంగా రాస్తాను

సుమిత్ర—"

తరువాత తరువాత నీరసుడు నిరుత్సాహి అయిన సుబ్బారావును చూసినప్పుడల్లా సుందరానికి తమయిద్దరిలో ఎవరి గురించి ఎక్కువ జాలి పడవలసి ఉందా అని అనుమానం కలుగుతుంది. దాంపత్యపు పరీక్షలో తప్పిపోయినవాడు సుబ్బారావు; పరీక్షకు కూర్చుందికే శక్తి సామర్థ్యాలు చాలక వెనక్కి తగ్గిపోయినవాడు తాను. అయినా తనతో సహా లోకుల అందరి సానుభూతి సుబ్బారావుదే. సుబ్బారావు గురించి తాను జాలిపడగలడు గానీ, అంతమాత్రంలో సుమిత్రను ద్వేషించి తీరాలని నిర్బంధం ఏమిటో? అయితే తాను ఆమెను సమర్థించడానికి ఏమి మాట్లాడినా తాను ఆశించిన దానికి విరుద్ధమయిన ఫలితం మాత్రమే కలుగుతుంది. ఆ మాత్రం ప్రాపంచికజ్ఞానం తనకు లేకపోలేదు.